క్లుప్తంగా

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి



పెదకూరపాడు: గర్భిణులు వైద్యుల సూచనలు పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలని పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం గైనకాలజిస్ట్ డాక్టర్ కూచిపూడి సుజాత సూచించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గర్భిణులకు ఉచిత పౌష్టికాహారాన్ని మంగళవారం అందజేశారు. మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత ఐదేళ్ల నుంచి గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు, కుంచనపల్లి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి: బిడ్డలు ఆరోగ్యంగా జన్మించాలంటే గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవాలని జన చైతన్య సమితి కార్యదర్శి తుల్లూరి సాంబశివ రావు అన్నారు. అమరావతికి చెందిన పోలిశెట్టి సాయిబాబు, వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో వివిధ వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన 50 మంది గర్భిణులకు మంగళవారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో జన చైతన్య సమితి ప్రతినిధి షేక్ లియాకత్ ఆలి, సరస్వతి శిశుమందిర్ ప్రధానోపాధ్యాయుడు కోలా వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

ముప్పాళ్ళ: మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో గల విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని 11కేవీ ముప్పాళ్ళ ఫీడర్ లైన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ జి.సుచరిత మంగళవారం తెలిపారు. ముప్పాళ్ళ ఫీడర్ పరిధిలోని చాగంటివారిపాలెం, ముప్పాళ్ళ రామకృష్ణాపురం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

యూరియా వాడకంపై అవగాహన కార్యక్రమాలు



క్రోసూరు: పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సచివాలయ పరిధిలోని అన్ని రైతు సేవా కేంద్రాల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసు ఒక టీంగా ఏర్పడి యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తారని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. క్రోసూరు-1 రైతు సేవా కేంద్రంలో ఈ మేరకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వారం రోజుల పాటు ప్రతి గ్రామంలో యూరియా వాడకం పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని.. రైతులు అవగాహన చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.వి.నాగరాజు, మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్, ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దోమల నివారణకు యాంటీ లార్వా పిచికారీ



బెల్లంకొండ: గ్రామాల్లో దోమల నివారణకు వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ సిబ్బంది యాంటీ లార్వా ద్రావణాన్ని పిచికారీ చేయిస్తున్నారు. మంగళవారం మండలంలోని మన్నెసుల్తాన్ పాలెం, వన్నాయపాలెం, ఎమ్మాజీగూడెం, రామాంజనేయపురం, కందిపాడు, నందిరాజుపాలెం, మాచాయపాలెం గ్రామాల్లో స్ప్రేయింగ్ చేయించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డా.కిరణ్ తెలిపారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో సూపర్‌వైజర్ బాషా, హెల్త్ అసిస్టెంట్ శంకర్ రెడ్డి, ఆయా గ్రామాల ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గెలుపే ధ్యేయంగా పనిచేయాలి



సత్తెనపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో గల తన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండలస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నూతనంగా ఎన్నికైన ప్రతి ఒక్కరూ పాలనలో అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ వెళ్లి తెలియజేయాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు దరువూరి నాగేశ్వరరావు, మక్కపాటి రామచంద్రరావు, ఆళ్ల సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత పోరుకు తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

- రైతులకు అండగా సిద్ధమైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు
- ఆంక్షలున్నా లెక్కచేయని పార్టీ శ్రేణులు
- అనుమతులు లేవంటూ అడ్డుకున్న పోలీసులు



సత్తెనపల్లి అన్నదాత పోరులో మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: కూటమి ప్రభుత్వం పెట్టిన ఆంక్షలను లెక్కచేయని వైఎస్సార్ సీపీ శ్రేణులు రైతులకు అండగా సిద్ధమయ్యారు. మంగళవారం నిర్వహించిన అన్నదాత పోరు నిరసన కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు దండుగా తరలివెళ్లారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రైతన్నలకు మద్దతుగా ఎరువులను కొరత లేకుండా సరఫరా చేయాలంటూ డిమాండ్ చేస్తూ సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆందోళన కార్యక్రమానికి వెళ్లేందుకు అనుమతులు లేవంటూ పోలీసులు సోమవారం రాత్రి పార్టీ శ్రేణులకు నోటీసులు అందజేశారు. అయినప్పటికీ పార్టీ పిలుపు మేరకు రైతుల కోసం ఆందోళన చేసేందుకు సిద్ధమై సత్తెనపల్లి వెళ్లారు. అక్కడ తమ నేతలు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి సుధీర్ భార్గవరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎనుముల మురళీధరరెడ్డి నాయకత్వంలో ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి ఆర్డీవో రమణాకాంత్ రెడ్డికి అర్జీ అందజేశారు. క్రోసూరు నుంచి వెళ్లిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు వెలది అప్పారావు, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, అనుముల రోశిరెడ్డి, పాశం శ్రీనివాస రెడ్డి, అనుముల కోటిరెడ్డి, కేశవరెడ్డి, విప్పల వెంకట్రామిరెడ్డి, రాజశేఖర రెడ్డి, చందు పలువురు కార్యకర్తలు ఉన్నారు.

ముప్పాళ్ళ: రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి మండలంలోని పలు గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డా.గజ్జల సుధీర్ భార్గవరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సత్తెనపల్లిలోని ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టిన కార్యక్రమంలో అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు ఇందూరి నరసింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఎంజేఎం రామలింగారెడ్డి, మాజీ మండల కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, కుందురువారిపాలెం సర్పంచ్ చయికం వెంకటప్పారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కానాల పుల్లారెడ్డి, సైదా, గున్నం కృష్ణారెడ్డి, కాటయ్య, శివరామిరెడ్డి, కిక్కురు రామిరెడ్డి, ఎస్కే హుస్సేన్, మౌలాలి, జక్కిరెడ్డి, వీరయ్య, కుందురు శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా పోలీసుల ఆంక్షలు..

రైతులకు బాసటగా వైఎస్సార్ సీపీ చేపట్టిన 'అన్నదాత పోరు'కు పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించారు. సోమవారం అర్ధరాత్రి సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుల ఇళ్లకు వెళ్లి హౌస్ అరెస్టులు, నోటీసులు ఇవ్వడం చేశారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో 70 మందికి, పెదకూరపాడు నియోజకవర్గంలో 50 మందికి నోటీసులు ఇచ్చారు. ముందుగా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని, అనుమతులు లేకుండా ర్యాలీలు, సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదని, ధిక్కరించి ఎవరైనా నిర్వహిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ ప్రత్యేక వాహనం ద్వారా ప్రచారం నిర్వహించారు.



హనుమంతరావుకు నోటీసులు అందజేస్తున్న పోలీసులు

రైతుల పొట్ట కొడుతున్న కూటమి ప్రభుత్వం..

సత్తెనపల్లి: ప్రకృతి వైపరీత్యాలతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం తగ్గినా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యూరియా అందించడంలో విఫలం చెంది రైతుల పొట్ట కొడుతోందని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. ఎరువులు బ్లాక్ మార్కెట్, యూరియా కొరతపై రైతులకు బాసటగా వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు 'అన్నదాత పోరు' పేరిట నిరసన కార్యక్రమం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరరావు, డాక్టర్ గజ్జల, మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వానికి రైతుల మీద ధ్యాస లేదన్నారు. రైతులందరికీ యూరియా కట్టలు అందుబాటులోకి తీసుకురావాలని పెదకూరపాడు నియోజకవర్గ పరిశీలకుడు యెనుముల మురళీధరరెడ్డి అన్నారు. రైతులకు రాజకీయాలు ఆపాదించటం దారుణమని సత్తెనపల్లి నియోజకవర్గ పరిశీలకుడు పడాల శివారెడ్డి అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పంచుమర్తి అప్పారావు మాట్లాడుతూ.. రైతులపై ఆంక్షలు పెట్టి యూరియా ఒక పార్టీకి చెందిన వారికే ఇవ్వడం సమంజసం కాదన్నారు.

అమరావతి: సత్తెనపల్లిలో నిర్వహించే అన్నదాత పోరుకు వెళ్లకుండా నిరోధించడానికి మండల పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో నాయకులకు సత్తెనపల్లిలో ఎటువంటి సమావేశాలు, ర్యాలీలకు పోలీసుల అనుమతి లేదని నాయకులు వెళితే కేసులు నమోదు చేస్తామని ముందస్తుగా నోటీసులు జారీ చేశారు. నోటీసులు జారీ చేసినవారిలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు అలా లక్ష్మీనారాయణ, జిల్లా పరిషత్ కోఆప్షన్ మెంబర్ షేక్ హష్మీలతో పాటు పార్టీ నాయకులు తోకల సూరిబాబు, పాపారావులతో పాటు 15మందికి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

పెదకూరపాడు: 'రైతుల సమస్యలపై పోరాడుతుంటే నడిరోడ్డు మీద అడ్డగించి నిర్బంధిస్తారా.. ప్రజాస్వామ్యంలోనే ఉన్నామా' అంటూ పెదకూరపాడు మండలం ఎంపీపీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు బెల్లంకొండ మీరయ్య పోలీసులను ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ పిలుపుమేరకు సత్తెనపల్లిలోని ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమానికి వెళుతున్న సమయంలో సత్తెనపల్లి మండలం అద్దరోడ్డు వద్ద పోలీసులు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య కారును అడ్డగించి రోడ్డుపైనే నిర్బంధించారు. కార్యకర్తలను సైతం పోలీసులు నడిరోడ్డుపై మండుటెండలో అడ్డుకుని నిర్బంధించారు. పోలీసుల ఆంక్షలను తిప్పికొడుతూ కొందరు నడిచే ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు.

అర్ధరాత్రి పోలీసుల నోటీసులు..

పాకాలపాడు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కొర్లకుంట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు పంపిణీ చేసిన యూరియాలో కనీసం 10 శాతం కూడా వైఎస్సార్ సీపీ సానుభూతి పరులైన రైతులకు ఇవ్వలేదన్నారు. నిరసన కార్యక్రమానికి వెళ్లడానికి వీలు లేదని రాత్రి 1.10 గంటలకు పోలీసులు వచ్చి నోటీసులు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బాసులింగారెడ్డి, షేక్ మౌలాలి, రాయపాటి పురుషోత్తమరావు, వేపూరి శ్రీనివాసరావు, నక్కా శ్రీనివాసరావు, భవనం రాఘవరెడ్డి, గంగారపు అనూష, కొణతం స్వాతి, మర్రి సుబ్బారెడ్డి, మేడ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఎంజెఎం రామలింగారెడ్డి, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, ఇందూరి నరసింహారెడ్డి, చిలుకా జైపాల్, సయ్యద్ గోరా, గుంటూరు జానీ, షేక్ నాగూర్ భాష, షేక్ జలీల్, తుమ్మల వెంకటేశ్వరరావు, కొండవీటి కోటేశ్వరరావు, చెన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బచ్చు హనుమంతురావు, షేక్ జానీ, ఈదా సాంబిరెడ్డి, నెల్లూరి చంద్రబాబు, బెల్లంకొండ మీరయ్య, మంచికల్వపూడి వీరరాఘవయ్య, భవిరిశెట్టి హనుమంతరావు,గఫూర్, వెలది అప్పారావు, అన్నపురెడ్డి నర్సిరెడ్డి, చిలుకా చంద్రయ్య, పెరుమాళ్ళ కోటయ్య, గార్లపాటి దాసు, బత్తుల.కోటేశ్వరరావు, కొంపెర్ల రోశయ్య, సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు ఉన్నారు.



పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద 30 పోలీస్ యాక్ట్ ప్రచారం చేస్తున్న వాహనం



ఎంపీపీ మీరయ్యను అడ్డుకుంటున్న పోలీసులు



నందిగామ అడ్డరోడ్డు వద్ద పార్టీ కార్యకర్తలను నిర్బంధించిన పోలీసులు



నందిగామ అడ్డరోడ్డు వద్ద పెదకూరపాడు నుంచి వస్తున్న వాహనాలను అడ్డుకుంటున్న పోలీసులు

మంచినీటి ట్యాంక్‌కు మరమ్మతులు చేపట్టాలి

క్రోసూరు: క్రోసూరు గ్రామంలోని 1, 2 వార్డు ప్రజలకు మంచినీటిని అందించడానికి నిర్మాణం చేపట్టిన మంచినీటి ట్యాంకుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరారు. భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వారు డిప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాస్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు చిల్కా ఏషియ్య మాట్లాడుతూ.. మంచినీటి ట్యాంకు శుభ్రం చేయడానికి ఏర్పాటు చేసిన మెట్లు పూర్తిగా విరిగిపోయాయని.. దీంతో ట్యాంకు శుభ్రం చేయడానికి వీలుకావడం లేదని.. వెంటనే మెట్ల మార్గాన్ని పునర్నిర్మాణం చేసి, ఇతర మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎలిజిబెత్, ఏసుబాబు, రాంబాబు, బాలరాజు, వినయ్, చిన్నబ్బాయి, యేసయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు



దెబ్బతిన్న వాటర్ ట్యాంకు మెట్లు

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

ఈనెల 15న రాష్ట్ర కార్మికశాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడి

సత్తెనపల్లి: ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను అమలు చేయాలని భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని గార్లపాడు బస్టాండ్ సెంటర్లో కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయ ముట్టడి వాల్ పోస్టర్‌ను ఈ సందర్భంగా మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ప్రసాదరావు మాట్లాడుతూ.. ఈనెల 15వ తేదీన విజయవాడలోని రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మికులందరూ తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమానికి జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులందరూ చలో విజయవాడకు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు కోట ఆంజనేయులు, జి.సాల్మన్‌రాజు, సీఐటీయూ నాయకులు ఆర్.పురుషోత్తం, ఎం.హరిపోతురాజు, స్థానిక భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అవ్వారు ప్రసాదరావు, సీఐటీయూ నాయకులు

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన కీలకం

సత్తెనపల్లి: సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన కీలకమని డీఎల్‌డీవో రాజగోపాల్ అన్నారు. సత్తెనపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై ఎంపీపీలు, సర్పంచ్‌లకు రెండు రోజులు నిర్వహించే డివిజన్ స్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరేందుకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. లక్ష్యాల సాధనకు ప్రజా ప్రతినిధులు అంకిత భావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. శిక్షణకు సత్తెనపల్లి, ముప్పాళ్ళ, నకరికల్లు, క్రోసూరు, బెల్లంకొండ మండలాల మండల పరిషత్ అధ్యక్షులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బుధవారం కూడా శిక్షణ కొనసాగుతుందని, గురు, శుక్రవారాలు అమరావతి, అచ్చంపేట, రాజుపాలెం, పెదకూరపాడు మండలాల ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. శిక్షణ కార్యక్రమానికి డి.ప్రదీప్ కుమార్, కె.ఏసోబు, జి.సదా శివకుమారి, సురేఖలు ట్రైనర్‌లుగా వ్యవహరించారు. ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో షేక్ అజీజుర్ రెహమాన్, నందిగామ పంచాయతీ కార్యదర్శులు కుంభ వెంకటేశ్వర్లు, చిలువూరి కృష్ణ ప్రసాద్, ఫణిదం, కట్టమూరు డిజిటల్ అసిస్టెంట్‌లు శివశంకర్, లక్ష్మణ్‌రావులు, జూనియర్ అసిస్టెంట్ విజయ సుందర్‌దాస్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎల్‌డీవో రాజగోపాల్

పొలం పిలుస్తోందిలో రైతులకు అవగాహన

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా డాట్‌సెంటర్ శాస్త్రవేత్త పాముల వెంకటసత్య గోపాల్ పాల్గొని పత్తి, మిరప, వరి పంటలలో ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో ఎస్.శేషుబాబు, ఎంపీఈవో, రైతులు పాల్గొన్నారు.

కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

మాదల(ముప్పాళ్ళ): అప్పులు బాధతో చనిపోయిన కౌలు రైతు యర్రంశెట్టి కోటేశ్వరరావు కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మండంలోని మాదల గ్రామంలో అప్పుల బాధ తాళలేక సోమవారం ఆత్మహత్యకు పాల్పడిన కౌలురైతు యర్రంశెట్టి కోటేశ్వరరావు మృతదేహాన్ని మంగళవారం సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగు భారంగా మారిందని, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కౌలు రైతుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలన్నారు. కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు పెండ్యాల మహేష్, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి బాలకృష్ణ, కౌలు రైతు సంఘం నాయకులు జాలయ్య, కందిమళ్ల సాంబశివరావు తదితరులు ఉన్నారు.

పాఠశాలకు ప్లేట్లు అందజేత

పలుదేవర్లపాడు(ముప్పాళ్ళ): మండలంలోని పలుదేవర్లపాడు గ్రామంలోని ఎంపీపీ పాఠశాల(ఎల్ఈ) విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి అవసరమైన ప్లేట్లు, గ్లాసులను మంగళవారం దాత అందించారు. గ్రామానికి చెందిన జరుగుమాల జేమ్స్ తన తండ్రి ఆశీర్వాదం జ్ఞాపకార్థం ప్లేట్లు, గ్లాసులను ఎంఈవో పి.సుధారాణి చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్.మహబూబ్ సుభాని, ఉపాధ్యాయిని వై.రమాదేవి, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ ఎస్.ప్రశాంత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

సత్తెనపల్లి: ఉద్యోగులకు 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని ఫ్యాప్టో చైర్మన్, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాసరావు అన్నారు. సత్తెనపల్లిలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఎస్టీయూ సత్తెనపల్లి ఏరియా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తక్షణమే 12వ పీఆర్సీ, 30 శాతం ఐఆర్, పెండింగ్ డీఏలు, ఉద్యోగస్తులకు రావాల్సిన ఎరియర్స్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ఎం సుభాని మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దు చేయాలని, అసెస్మెంట్ బుక్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఏరియా ఎస్టీయూ బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం



సన్మాన కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దొప్పలపూడి వెంకటేశ్వర్లు



సత్కార గ్రహీతలు క్రోసూరు క్లస్టర్ ఉపాధ్యాయులు

పీసపాడు(క్రోసూరు): అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని మంగళవారం మండలంలోని పీసపాడు గ్రామం మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన పాఠశాల ఉపాధ్యాయుడు(బీసీ) దొప్పలపూడి వెంకటేశ్వర్లుకి అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు టి.కృష్ణ ,ఎం.గణేష్ పాల్గొని వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించారు.ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముట్లూరు వెంకయ్య, గ్రామ పెద్దలు కంచేటి నరసింహారావు,స్థానిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రోసూరు: ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందని మండల విద్యాశాఖ అధికారులు జి.కృష్ణ, ఎం.గణేష్‌లు పేర్కొన్నారు. క్రోసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కాంప్లెక్స్ స్థాయి ఉపాధ్యాయుల సత్కార కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ చైర్మన్ దుగ్గి బాబూరావు, సెక్రటరీ చల్లా జాన్ పాల్, చిల్కా సురేష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులందరినీ ఘనంగా సత్కరించారు.

పంటల వివరాలు నమోదు చేయాలి

నార్నెపాడు(ముప్పాళ్ళ): గ్రామస్థాయి యూరియా పంపిణీ పరిరక్షణ కమిటీ సభ్యులు ఆయా గ్రామాల్లో ఇప్పటి వరకు సాగు అయిన పంటల వివరాలను నమోదు చేయాలని మండల ప్రత్యేకాధికారి రామారావు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల యూరియా పంపిణీ పర్యవేక్షణ కమిటీ సభ్యులైన మండల ప్రత్యేకాధికారి రామరావు, తహసీల్దార్ కె.నగేష్, ఎంపీడీవో పి.రత్నం, మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డిలు మంగళవారం పలుదేవర్లపాడు, నార్నెపాడు, లంకెలకూరపాడు గ్రామాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. మండలంలో సాగుకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, ఎలాంటి యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని రైతులకు అవగాహన కల్పించారు.



రైతులతో మాట్లాడుతున్న రామారావు

విలీన ప్రక్రియను విరమించుకోవాలి

సత్తెనపల్లి: మున్సిపాలిటీలో సత్తెనపల్లి మండలం భీమవరం గ్రామపంచాయతీని విలీనం చేసే ప్రక్రియను విరమించుకోవాలని గ్రామస్తుడు కొల్లు మల్లేశ్వరరావు కోరారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్‌ను కలిసి వార్డు సభ్యుల సంతకాలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ.. వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు విలీన ప్రక్రియకు వ్యతిరేకమని తెలిపారు. కమిషనర్ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ.. కలెక్టర్‌కు నివేదిక పంపుతామన్నారు. ఆయనతో పాటు గ్రామస్తులు పాలెపోగు బాలయ్య ఉన్నారు.